# ముత్యంపేటలో అక్రమ గోవధ కలకలం

**నేతల మౌనంపై విమర్శలు**

**నిందితులను శిక్షించాలని డిమాండ్**

**ముత్యంపేటలో పటిష్ట నిఘా**



**శాంతిసౌభ్రాతృత్వాలకు నిలయమైన గ్రామీణ ప్రాంతాల్లో ఒక్కసారిగా అలజడి రేగింది. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలోని ముత్యంపేట గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా గోవధ జరిగినట్లు వెలుగులోకి వచ్చిన సమాచారం స్థానికంగా తీవ్ర ఆందోళనకు దారితీసింది. మతపరమైన విశ్వాసాలను దెబ్బతీస్తూ చట్టాలను ధిక్కరిస్తూ సాగిన ఈ ఉదంతంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది.**

తుడుం జితేందర్-జనం పవర్ -ఉత్తర తెలంగాణ బ్యూరో

ముత్యంపేట గ్రామ శివార్లలో నిబంధనలకు విరుద్ధంగా గోవధ జరిగినట్లు స్థానికులు గుర్తించారు. హిందూ ధర్మంలో గోవును పవిత్రంగా భావించే నేపథ్యంలో ఈ చర్య స్థానిక ప్రజల మనోభావాలను తీవ్రంగా గాయపరిచింది. ఘటన గురించి తెలియగానే గ్రామస్థులు పెద్ద ఎత్తున గుమిగూడి నిరసన వ్యక్తం చేశారు. గ్రామాల్లో మత సామరస్యాన్ని దెబ్బతీసేలా ఇటువంటి చర్యలకు పాల్పడటం అత్యంత విచారకరమని నిందితులను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

### రాజకీయ పార్టీల వైఖరిపై అనుమానాలు

ఈ ఘటన రాజకీయంగా కూడా వేడిని పుట్టిస్తోంది. ముఖ్యంగా హిందూ ధర్మ పరిరక్షణ గోసంరక్షణ గురించి గళమెత్తే బీజేపీ వంటి పార్టీలు ఈ విషయంలో మౌనం వహించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ అక్రమ ఉదంతంపై స్థానిక నాయకులు స్పష్టమైన వైఖరి తీసుకోకపోవడం వెనుక మర్మమేంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కొందరు నాయకులు ఈ ఘటనకు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా మద్దతు ఇస్తున్నారనే గుసగుసలు వినిపిస్తుండటం చర్చనీయాంశంగా మారింది. ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే ఈ నిశ్శబ్దమా అని సామాన్యులు నిలదీస్తున్నారు.

### కట్టుదిట్టమైన నిఘా అవసరం

సామాజిక సామరస్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వం అధికారులపై ఉంది. ఈ ఘటనపై వెంటనే స్పందించి ప్రత్యేక బృందంతో విచారణ జరిపించాలని ప్రజలు కోరుతున్నారు. నిందితులు ఎంతటి వారైనా సరే చట్టపరంగా శిక్షించాలని భవిష్యత్తులో జిల్లాలో ఎక్కడా ఇటువంటి అక్రమ ఉదంతాలు జరగకుండా నిఘా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. రాజకీయాలకు అతీతంగా న్యాయం జరగాలని పవిత్రమైన భావాలను కించపరిచే వారిపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలని ముత్యంపేట ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# పశువుల అక్రమ రవాణా బట్టబయలు

- పది ఎడ్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు
- ముగ్గురు వ్యక్తులపై కేసులు నమోదు



తుడుం జితేందర్-జనం పవర్ -ఉత్తర తెలంగాణ బ్యూరో

జన్నారం మండలంలోని ఇంధనపల్లి ఫారెస్ట్ చెక్ పోస్ట్ వద్ద సోమవారం రాత్రి పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో పశువుల అక్రమ రవాణా వెలుగులోకి వచ్చింది. నిబంధనలకు విరుద్ధంగా బొలెరో వాహనాల్లో ఎడ్లను తరలిస్తున్న ముగ్గురిపై జన్నారం ఎస్సై ఉదయ్ కిరణ్ కేసు నమోదు చేశారు.

### తనిఖీల్లో దొరికిన అక్రమ రవాణా

సోమవారం రాత్రి ఎస్సై ఉదయ్ కిరణ్ తన సిబ్బందితో కలిసి ఇంధనపల్లి ఫారెస్ట్ చెక్ పోస్ట్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో జన్నారం నుండి నిర్మల్ వైపు వెళ్తున్న ఒక బొలెరో వాహనం, జైనూర్ నుండి కరీంనగర్ వైపు వెళ్తున్న రెండు బొలెరో వాహనాలను ఆపి తనిఖీ చేశారు. ఈ మూడు వాహనాల్లో మొత్తం 10 ఎడ్లను గుర్తించారు.

### క్రూరంగా తరలిస్తుండటంతో కఠిన చర్యలు

ఒక్కో వాహనంలో మూడు నుండి నాలుగు ఎడ్లను సామర్థ్యానికి మించి, అత్యంత క్రూరంగా ఇరుకుగా తరలిస్తుండటంతో పోలీసులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. పశువుల పట్ల నిర్దయగా వ్యవహరిస్తూ నిబంధనలు ఉల్లంఘించినందుకు సదరు వాహనదారులపై జంతు హింస నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. స్వాధీనం చేసుకున్న పశువులను సంరక్షణ కేంద్రానికి తరలించి, వాహనాలను సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. చట్టవిరుద్ధంగా పశువుల రవాణా చేసే వారిపై నిరంతరం నిఘా ఉంటుందని ఎస్సై హెచ్చరించారు.



# జన్నారంలో ఎన్డీఏ ఘనవిజయం సంబరాలు

- కవ్వాల్ గ్రామంలో భారీ విజయోత్సవ ర్యాలీ
- బాణాసంచా కాల్చి మిఠాయిల పంపిణీ
- మోడీ నాయకత్వానికి ప్రజల బ్రహ్మరథం
- బీజేపీ, శివాజీ యూత్ ఆధ్వర్యంలో ఉత్సవం

తుడుం జితేందర్-జనం పవర్ -ఉత్తర తెలంగాణ బ్యూరో

దేశంలోని మూడు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి ఘనవిజయం సాధించడంతో జన్నారం మండలంలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విజయోత్సవాల్లో భాగంగా కవ్వాల్ గ్రామంలో భారతీయ జనతా పార్టీ కమిటీ, ఛత్రపతి శివాజీ యూత్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం భారీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. కవ్వాల్ గ్రామంలోని ప్రధాన రహదారుల గుండా సాగిన ఈ ర్యాలీలో బీజేపీ శ్రేణులు, యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు. విజయానికి చిహ్నంగా బాణాసంచా కాలుస్తూ ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుంటూ సంతోషాన్ని పంచుకున్నారు. భారత్ మాతాకీ జై, నరేంద్ర మోడీ నాయకత్వం వర్ధిల్లాలి, జైశ్రీరామ్ నినాదాలతో గ్రామం మార్మోగిపోయింది. ఈ సంబరాల్లో 6వ వార్డు సభ్యులు రాథోడ్ రాజునాయక్, శక్తి కేంద్రం ఇంచార్జ్ భుక్యా సదసింగ్, బూత్ అధ్యక్షులు రంగు రాకేష్, వంగ సాయి కుమార్ ముందంజలో నిలిచి కార్యక్రమాన్ని నడిపించారు. ర్యాలీలో రంగు సాయికిరణ్, జానీ మహేష్, ప్రవీణ్, ఉల్లి పవన్, అజయ్, రమేష్, కల్యాణ్, వంగ స్వామి పాల్గొన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ



నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజారంజక పాలనకు ప్రజలు మరోసారి బ్రహ్మరథం పట్టారని నాయకులు కొనియాడారు. ఈ విజయం దేశవ్యాప్తంగా ఉన్న కార్యకర్తల విజయమని పేర్కొన్నారు. ఛత్రపతి శివాజీ స్ఫూర్తితో, మోడీ అడుగుజాడల్లో దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు యువత సిద్ధంగా ఉందని శివాజీ యూత్ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇందన్ పల్లి, కలమడుగు, చింతగూడ గ్రామస్తులు పాల్గొన్నారు.

# బాలికపై అఘాయిత్యానికి 20 ఏళ్ల జైలు

**ఫాస్ట్ ట్రాక్ కోర్టు తీర్పు..బాధితురాలికి ఆర్థిక సాయం**

**నిందితుడికి భారీ జరిమానా.. నేరం రుజువు కావడంతో శిక్ష**

తుడుం జితేందర్-జనం పవర్ -ఉత్తర తెలంగాణ బ్యూరో



బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడికి మంచిర్యాల ఫాస్ట్ ట్రాక్ కోర్టు సోమవారం కఠిన శిక్ష విధించింది. బెల్లంపల్లి 1 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఈ పోక్సో కేసులో నిందితుడు బంద సాయికృష్ణకు 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ స్పెషల్ జడ్జి లాల్ సింగ్ శ్రీనివాస నాయక్ తీర్పునిచ్చారు. బాబు క్యాంపు నివాసి బంద సాయికృష్ణపై నేరం రుజువు కావడంతో 20 ఏళ్ల జైలు శిక్ష ఖరారు చేశారు. శిక్షతో పాటు 10 వేల జరిమానా విధిస్తూ కోర్టు ఆదేశించింది. బాధితురాలికి ప్రభుత్వం తరపున 2 లక్షల పరిహారం అందజేయాలని న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు. పోలీసులు సమర్పించిన సాక్ష్యాలు, ఆధారాలను పరిశీలించిన అనంతరం న్యాయస్థానం ఈ కీలక నిర్ణయం తీసుకుంది. చిన్నారులపై అఘాయిత్యాలకు పాల్పడితే చట్టం కఠినంగా వ్యవహరిస్తుందని ఈ తీర్పు ద్వారా మరోసారి స్పష్టమైంది. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు జరగకుండా ఈ తీర్పు ఒక హెచ్చరికగా నిలుస్తుందని సామాజికవేత్తలు భావిస్తున్నారు.

# చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్

**రిటైర్డ్ ఉద్యోగి ఇంట్లో భారీ దొంగతనం.. 311 గ్రాముల బంగారం స్వాధీనం**

**చాకచక్యంగా పట్టుకున్న పోలీసులు.. నిందితుల నుంచి కిలో వెండి రికవరీ..**



తుడుం జితేందర్-జనం పవర్ -ఉత్తర తెలంగాణ బ్యూరో

మంచిర్యాల పట్టణంలోని గౌతమేశ్వర కాలనీలో గత నెలలో చోటుచేసుకున్న భారీ దొంగతనం కేసును పోలీసులు ఛేదించారు. సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి ముద్దం నాగయ్య ఇంట్లో బీభత్సం సృష్టించి భారీగా నగదు, నగలు అపహరించిన ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ముద్దం నాగయ్య కుటుంబ సభ్యులతో కలిసి గత నెలలో ఒక శుభకార్యానికి వెళ్లగా అదే అదనుగా భావించిన దొంగలు ఇంటి తాళాలు పగలగొట్టి లోపలికి ప్రవేశించారు. బీరువాలో ఉన్న బంగారు, వెండి ఆభరణాలను దోచుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేపట్టారు. నమ్మదగిన సమాచారం, సాంకేతిక ఆధారాల సహాయంతో పోలీసులు నిందితులను పట్టుకున్నారు. అరెస్ట్ అయిన వారిని ఆశిష్ శ్రీనివాస్, రెడ్డిమల్ల ఆకాశ్‌గా గుర్తించారు. వీరు పథకం ప్రకారమే తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్నట్లు విచారణలో తేలింది. నిందితుల వద్ద నుంచి పోలీసులు భారీగా చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఇందులో 311 గ్రాముల వివిధ రకాల బంగారు ఆభరణాలు, సుమారు ఒక కిలో బరువున్న వెండి వస్తువులు ఉన్నాయి. ప్రజలు ఊర్లకు వెళ్లేటప్పుడు పోలీసులకు సమాచారం ఇవ్వాలని లేదా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డీసీపీ భాస్కర్ సూచించారు. సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా నేరాలను త్వరగా అదుపు చేయవచ్చని పేర్కొన్నారు. కేసును ఛేదించిన పోలీస్ అధికారులను, సిబ్బందిని డీసీపీ అభినందించారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు.

# మోడీ బహిరంగ సభను విజయవంతం చేయాలి

**పెరేడ్ గ్రౌండ్స్ లో జన ఆగ్రహ సభ..అధిక సంఖ్యలో తరలిరావాలని విన్నపం**

**దండేపల్లిలో బీజేపీ శ్రేణుల సమావేశం..కార్యకర్తలు, రైతులు పాల్గొనాలని పిలుపు**

**దండేపల్లి, ఏప్రిల్ 04 (జనం పవర్):** ప్రధాని నరేంద్ర మోడీ బహిరంగ సభకు పెద్ద ఎత్తున ప్రజలు తరలి రావాలని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి పత్తిపాక సంతోష్ కోరారు. దండేపల్లి మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరేడ్ గ్రౌండ్స్ లో ఈ నెల 10న నిర్వహించే జన ఆగ్రహ సభకు కార్యకర్తలు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు.

### సభకు సన్నాహాలు

ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా గుండా ప్రభాకర్, అసెంబ్లీ ఇంచార్జ్ గోపతి రాజన్న పాల్గొన్నారు. ప్రధాన కార్యదర్శులు అనిల్, దివ్య, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎంబడి సురేందర్, చైర్మన్ బెడుద సురేష్, తులసి, లక్ష్మీనారాయణ, బోడకుంటి వెంకటేష్, చుంచు గిరిధర్, వెంకటేష్, గురువయ్య, సత్యనారాయణ, శ్రీనివాస్, కుమార్, ఎడ్ల రాజన్న, మల్లేష్, రమేష్, సంతోష్ సహా ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సభను జయప్రదం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.



# తడిసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలి

**కొనుగోలు కేంద్రాల్లో కలెక్టర్ తనిఖీలు..వడ్లను ఆరబెట్టి నాణ్యత పెంచాలని సూచన**

**కేంద్రాల్లో రైతులకు సదుపాయాలు కల్పించాలి: జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**వేల్పుల నగేష్, జనం పవర్-ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో**

ఇటీవల కురిసిన వర్షాల వల్ల తడిసిన ధాన్యాన్ని వెంటనే ఆరబెట్టి మిల్లులకు తరలించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. సోమవారం మందమర్రి మండలం సారంగపల్లి, బొక్కలగుట్ట ప్రాంతాల్లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించారు. తడిసిన ధాన్యాన్ని పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వం మద్దతు ధర చెల్లించి ధాన్యం కొనుగోలు చేస్తూ రైతు సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను నిబంధనల ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రైతుల కోసం కేంద్రాల్లో తాగునీరు, నీడ, తూకం యంత్రాలు, ప్యాడీ క్లీనర్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. ధాన్యం నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చూడాలని అధికారులకు స్పష్టం చేశారు. రైతు వివరాలను కంప్యూటర్ లో నమోదు చేసి ఆధార్ ద్వారా గుర్తింపును ధ్రువీకరించాలని కలెక్టర్ తెలిపారు. భూమి విస్తీర్ణం, పండించిన ధాన్యం వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులకు చెప్పారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన నగదును నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని కుమార్ దీపక్ వివరించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.


# లక్ష్య సాధన దిశగా విద్యార్థులు కృషి చేయాలి

**విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి**

**చదువుతో పాటు సాంస్కృతిక పోటీల్లో పాల్గొనాలి**

**జమ్మికుంటలో చాణక్య కళాశాల వార్షికోత్సవం**

**కరస్పాండెంట్ దబ్బుట విజయ రవీందర్**



**జమ్మికుంట, మే 04 (జనం పవర్):** జమ్మికుంట పట్టణంలోని చాణక్య డిగ్రీ కళాశాల వార్షికోత్సవం సోమవారం స్థానిక వినాయక గార్డెన్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ దబ్బుట విజయ రవీందర్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని వాటిని సాధించే దిశగా కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు కేవలం తరగతి గదికే పరిమితం కాకుండా సాంస్కృతిక కార్యక్రమాలలో ఉత్సాహంగా పాలుపంచుకోవాలని కోరారు. చదువుతో పాటు ఇతర రంగాల్లో రాణించినప్పుడే పరిపూర్ణత లభిస్తుందని పేర్కొన్నారు. విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి వార్షికోత్సవాలు దోహదపడతాయని తెలిపారు. ఈ వేడుకల్లో కళాశాల డైరెక్టర్లు ప్రభాకర్, శ్రీనివాస్, విజేందర్ రెడ్డి, చిరంజీవి, శివ పాల్గొన్నారు. వీరితో పాటు ప్రిన్సిపల్ వంశీకృష్ణ, అధ్యాపక బృందం, విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి.

# కేరళలో చక్రం తిప్పిన జుక్కల్ ఎమ్మెల్యే

**అడూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ ఘనవిజయం**

**నెల రోజులు అక్కడే ఉండి గెలుపుకు కృషి**

**జుక్కల్, మే 04 (జనం పవర్):** కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మి కాంతారావు తన మార్క్ చూపించారు. అడూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి సి.వి. శాంత కుమార్ 8 వేల పైచిలుకు మెజారిటీతో విజయం సాధించడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. ప్రతికూల పరిస్థితుల్లో రంగంలోకి దిగిన కాంతారావు నెల రోజులు అక్కడే మకాం వేసి వ్యూహాలు రచించి అభ్యర్థిని విజయం వైపు నడిపించారు. జుక్కల్ ముద్దుబిడ్డ పట్టిందల్లా బంగారమే అవుతోందని నియోజకవర్గ కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఈ విజయంతో జుక్కల్ పేరు దేశవ్యాప్తంగా మారుమోగుతోంది. ఎమ్మెల్యే పనితీరుతో ఏఐసీసీలో ఆయన ప్రాధాన్యత పెరిగింది. జుక్కల్ నియోజకవర్గాన్ని మరోసారి రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మార్చారు. కేరళలో కాంగ్రెస్ విజయానికి తోడ్పడినందుకు గాను కాంతారావుకు ఏఐసీసీలో కొత్త పదవి దక్కే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. నియోజకవర్గ అభివృద్ధిపైనే కాకుండా పార్టీ బలోపేతం కోసం ఆయన చేస్తున్న కృషికి తగిన గుర్తింపు లభిస్తుందని కార్యకర్తలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. సంబరాలు జరుపుకుంటున్న కాంగ్రెస్ శ్రేణులు ఎమ్మెల్యే నాయకత్వాన్ని కొనియాడుతున్నాయి.







# కోహెడలో హనుమాన్ అభిషేక పూజలు

- గవ్వ కమలమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో వేడుకలు
- వందలాది మందికి అన్నప్రసాద వితరణ
- సనాతన ధర్మం కాపాడాలని వంశీధర్ రెడ్డి పిలుపు
- భక్తిభావంతో హోరెత్తిన హరిహర క్షేత్రం

**కోహెడ, మే 04 (జనం పవర్):** సిద్దిపేట జిల్లా కోహెడ మండల కేంద్రంలోని హరిహర క్షేత్రం రామాలయంలో గవ్వ కమలమ్మ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు గవ్వ వంశీధర్ రెడ్డి ఆధ్వర్యంలో హనుమాన్ స్వామికి విశేష పూజలు ఘనంగా నిర్వహించారు. పురోహితులు డాక్టర్ కోహెడ ప్రసాద రావు వైధిక పూజలు నిర్వహించారు. వంశీధర్ రెడ్డి దంపతులు స్వామికి పంచామృత అభిషేకం, మన్యు సూక్త అభిషేకం, షోడశ ఉపచార పూజలు, గణపతి పూజ, మంటపారధన, మంత్ర పుష్పం, మంగళ హారతులు నిర్వహించారు. అనంతరం హనుమాన్ మాలధారులకు భిక్ష వితరణ, భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

**సనాతన ధర్మ పరిరక్షణ**

ఈ సందర్భంగా వంశీధర్ రెడ్డి మాట్లాడుతూ హనుమాన్ మాలధారణ హిందూ సంస్కృతిలో భాగమని చెప్పారు. ప్రేమ, శాంతి, తోటివారికి సేవ చేయాలనే సంకల్పం ఇలాంటి కార్యక్రమాల ద్వారా పెరుగుతాయని వివరించారు. హిందువుల ఐక్యతకు ఇవి దోహదపడతాయన్నారు. ప్రజలందరూ ఆంజనేయ స్వామి ఆశీర్వాదంతో సుభిక్షంగా ఉండాలని, పాడి పంటలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలనే సంకల్పంతో ఈ పూజలు నిర్వహించినట్లు తెలిపారు.

**విస్తృత సేవా కార్యక్రమాలు**

ముందు ముందు గవ్వ కమలమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హుస్నాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా విద్యా, వైద్య, ఆధ్యాత్మిక రంగాలలో విస్తృతంగా సేవలందిస్తామని వెల్లడించారు. తమ ఆహ్వానాన్ని మన్నించి వందలాది మంది మాలధారులు, ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షులు గవ్వ కిషన్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, హనుమాన్ స్వాములు, పలు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# సన్న వడ్ల సాగుకే ప్రాధాన్యత

**ఎరువులు పురుగుల మందుల వాడకంలో జాగ్రత్తలు అవసరం**

**ఉద్యాన పంటల రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి**

**మేయర్ దర్ని మధుకర్**



**వేల్పుల నగేష్, జనం పవర్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో**

మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 09 వ డివిజన్ లో మంచిర్యాల జిల్లా వ్యవసాయ శాఖ టీహార్టీ కల్చర్ డిపార్ట్ మెంట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమీక్ష కార్యక్రమానికి మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ దర్ని మధుకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 99 రోజుల ప్రగతి ప్రణాళికలో భాగంగా మేయర్ సీతారాంపల్లి క్లస్టర్ పరిధిలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి అధికారులతో సమీక్షించి తగిన సూచనలు చేశారు. రానున్న వేసంగిలో రైతులు సన్నపు వడ్లు పండించడానికి ప్రాధాన్యత ఇవ్వాలని మేయర్ కోరారు. ప్రభుత్వం సన్న వడ్ల కొనుగోలుకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో రైతులు సాగులో తీసుకోవాల్సిన మెలకువలు వాడాల్సిన ఎరువులు పురుగుల మందుల గురించి రైతులకు అవగాహన కల్పించారు. హార్టీ కల్చర్ డిపార్ట్ మెంట్ ఆధ్వర్యంలో రైతులకు ఉద్యానవన పంటలపై అందే రాయితీల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మేయర్ తో పాటు 09 వ డివిజన్ కార్పొరేటర్ సురిమిల్ల సౌమ్య వేణు ఏఈఓ సంధ్య రాణి ఏఓ మహేందర్ డిస్ట్రిక్ట్ హార్టీ కల్చర్ ఆఫీసర్ అనిత డీహెచ్ఎస్ఓ వెటర్నరీ సర్జన్ తిరుపతి హార్టీ కల్చర్ ఆఫీసర్ సహజ ఏఎంసీ డైరెక్టర్లు దర్ని మల్లేష్ ధోనిపెల్లి లింగయ్య స్థానిక కాంగ్రెస్ కార్యకర్తలు రైతులు సీతారాంపల్లి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఏఎస్ఐలుగా రవికుమార్ రామకృష్ణయ్యకు పదోన్నతి

**పోలీసుల్లో పెరిగిన బాధ్యతలు**

**హెడ్ కానిస్టేబుల్ నుంచి ఏఎస్ఐలుగా ప్రమోషన్**

**కుటుంబ సభ్యుల్లో వెల్లివిరిసిన ఆనందం**

**అభినందించిన ఎస్పీ రాజేష్ చంద్ర**

**జుక్కల్, మే 04 (జనం పవర్):** సదాశివనగర్, గాంధారి పీఎస్ హెడ్ కానిస్టేబుల్స్ ఎన్ రామకృష్ణయ్య, ఎస్ రవికుమార్ ఏఎస్ఐలుగా పదోన్నతి పొందారు. కామారెడ్డి జిల్లా ఎస్పీ ఎం రాజేష్ చంద్ర వారికి ఏఎస్ఐ హోదా చిహ్నాలను అలంకరించి అభినందించారు. పదోన్నతులు పోలీసుల్లో బాధ్యతను పెంచుతాయని ఈ సందర్భంగా ఎస్పీ పేర్కొన్నారు.

తమ విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచి పదోన్నతి పొందిన అధికారులను ఎస్పీ ప్రత్యేకంగా ప్రశంసించారు. కొత్త హోదాలో మరిన్ని బాధ్యతలతో ప్రజలకు సేవ చేయాలని సూచించారు. ఏఎస్ఐలుగా పదోన్నతి లభించడంతో రామకృష్ణయ్య, రవికుమార్ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు హర్షం వ్యక్తం చేశారు. పోలీస్ శాఖలోని తోటి సిబ్బంది వారికి శుభాకాంక్షలు తెలిపారు.



# అంతర్రాష్ట్ర వాహన దొంగల ముఠా అరెస్ట్

- మూడు రాష్ట్రాల్లో వాహనాల చోరీలే లక్ష్యం
- నిందితుల నుంచి పిస్టల్, కత్తులు స్వాధీనం
- టిప్పర్ వాహనం, 2 లక్షల నగదు సీజ్
- ఎస్పీ పరితోష్ పంకజ్



**సంగారెడ్డి, మే 05 (జనం పవర్):** సంగారెడ్డి జిల్లా పోలీసులు మరోసారి చాకచక్యాన్ని చాటుతూ అంతర్రాష్ట్ర వాహన దొంగల ముఠాను ఛేదించారు. ఇద్దరు ప్రధాన నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి ఆయుధాలు, నగదు, వాహనం సహా కీలక సాక్ష్యాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయాలను జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మీడియాకు వెల్లడించారు.



**ముఠా గుట్టురట్టు**

నారాయణఖేడ్ పరిధిలోని మనూర్ ఎక్స్ రోడ్ వద్ద ఏప్రిల్ 9న డీసీఎం వాహనం దొంగతనం జరిగినట్లు ఎస్పీ తెలిపారు. సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి నేతృత్వంలోని ప్రత్యేక బృందాలు సీసీటీవీ ఫుటేజీలు, సాంకేతిక ఆధారాలతో నిందితులను గుర్తించాయి. నారాయణఖేడ్ వద్ద వాహన తనిఖీల్లో మహమ్మద్ ఖుర్షీద్ అహ్మద్, మహమ్మద్ జాఫర్ అలీని అదుపులోకి తీసుకున్నారు.

**భారీగా ఆయుధాలు, సొత్తు స్వాధీనం**

నిందితుల నుంచి ఒక పిస్టల్, ఎయిర్ గన్, రెండు కత్తులు స్వాధీనం చేసుకున్నారు. వీరు తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాల్లో 11 చోట్ల వాహన దొంగతనాలు చేసినట్లు అంగీకరించారు. నిందితుల వద్ద నుంచి 2 లక్షల నగదు, 6 సెల్ ఫోన్లు, ఒక టిప్పర్ వాహనాన్ని పోలీసులు సీజ్ చేశారు. ఈ కేసును విజయవంతంగా ఛేదించిన సీసీఎస్ బృందం, నారాయణఖేడ్ పోలీస్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు. ఈ ప్రెస్‌మీట్‌లో అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ పాల్గొన్నారు.

# మల్కాపూర్ ప్రగతి బాట



నాలుగు నెలల్లోనే మారిన రూపురేఖలు

మహిళా భవనాల నిర్మాణానికి ఊతం

వసతుల కల్పనే లక్ష్యంగా పనులు

సర్పంచ్ అనిల్ కుమార్,

ఉప సర్పంచ్ ప్రవీణ్



**కొండాపూర్, మే 05 (జనం పవర్):** కొండాపూర్ మండలం మల్కాపూర్ గ్రామం అభివృద్ధి దిశగా దూసుకుపోతూ ఆదర్శంగా నిలుస్తోంది. సర్పంచ్ మామిడిపల్లి అనిల్ కుమార్, ఉప సర్పంచ్ జోగన్న ప్రవీణ్ నాయకత్వంలో గ్రామం కేవలం నాలుగు నెలల్లోనే గణనీయమైన మార్పులను చూసింది. ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న గ్రామ పాలకవర్గం అభివృద్ధిని కార్యాచరణలో చూపిస్తోంది. గతంలో వచ్చిన ఆరోపణలను ఖండిస్తూ ప్రస్తుతం జరుగుతున్న పనులే అభివృద్ధికి నిదర్శనమని పాలకవర్గం స్పష్టం చేసింది.

### సంక్షేమ పథకాల అమలు


గ్రామంలోని పేద ప్రజల అవసరాలను గుర్తించి రేషన్ కార్డుల మంజూరు, ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులను వేగవంతం చేశారు. తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు కొత్త బోర్లు వేయించారు. గ్రామ ప్రజల అవసరాల కోసం మార్కెట్ ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. నిలిచిపోయిన అభివృద్ధి పనులను తిరిగి ప్రారంభించి మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి పెట్టారు.

### మౌలిక వసతుల కల్పన

మహిళల అభివృద్ధి కోసం నాలుగు మహిళా సమైక్య భవనాలను మంజూరు చేయించగా రెండు భవనాలు ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్నాయి. రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చి ప్రయాణానికి అనుకూలంగా తీర్చిదిద్దారు. రాత్రివేళల్లో భద్రత కోసం ఐమాక్స్ లైట్లను ఏర్పాటు చేసి వీధులను వెలుగులతో నింపారు. గ్రామ పంచాయతీ భవనాన్ని ఆధునిక సదుపాయాలతో తీర్చిదిద్ది ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. మల్కాపూర్‌ను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో కృషి చేస్తున్నామని అనిల్ కుమార్, ప్రవీణ్ తెలిపారు.

# షరతులు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి

- బస్తాకు మూడు కిలోల తరుగుపై నిరసన
- మొక్కజొన్నను పూర్తిస్థాయిలో సేకరించాలి
- క్వింటాల్ కు 500 బోనస్ ఇవ్వాలి
- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్ కుమార్






**దండేపల్లి, ఏప్రిల్ 04 (జనం పవర్):** కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల నుంచి ఎలాంటి తరుగు షరతులు లేకుండా పంటను వెంటనే కొనుగోలు చేయాలి. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్ కుమార్ దండేపల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇరువైపులా వాహనాలు నిలిచిపోవడంతో ఎస్సై వచ్చి ఎమ్మార్వోతో మాట్లాడించడంతో ధర్నా విరమించారు.

### నిబంధనలపై ఆగ్రహం

ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు బస్తాకు మూడు కిలోల తరుగు తీయడంపై విజిత్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంటా అయిన తర్వాత పంటను తరలించడానికి బ్యాగుకు రెండు రూపాయలు అడగడం అవినీతికి నిదర్శనమని విమర్శించారు. మొక్కజొన్న పంటకు ఎకరానికి కేవలం 26 క్వింటాలు మాత్రమే తీసుకుంటున్నారని ఎలాంటి షరతు లేకుండా 40 క్వింటాలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వడ్లను ఏ గ్రేడ్ కింద కొనకుండా అందరినీ బీ గ్రేడ్ కింద కొంటున్నారని దీనివల్ల రైతులు క్వింటాల్ కు 20 రూపాయల చొప్పున నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

### ఎమ్మార్వోకు వినతిపత్రం

ప్రభుత్వం ప్రకటించిన విధంగా వడ్లకు క్వింటాల్ కు 500 రూపాయల బోనస్ ఇవ్వాలి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతు రాజులా బతికాడని ఈ కాంగ్రెస్ పాలనలో పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని విమర్శించారు. తరుగు లేకుండా పంటను కొనకపోతే రైతుల తరపున పోరాటం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఎమ్మార్వోకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చుంచు శ్రీనివాస్ మాజీ వైస్ ఎంపీపీ పాసర్తి అనిల్ మాజీ ఏఎంసీ డైరెక్టర్ నజిరుద్దీన్ పార్టీ సీనియర్ నాయకులు ఉస్మాన్ ఖాన్ కోట రవి జయాకర్ రాయలింగు పాల్గొన్నారు.

# కామారెడ్డి అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక భరోసా

ఇందిరా చౌక్ వద్ద 22 దుకాణాలు దగ్ధం.. కోటి రూపాయల మేర ఆస్తి నష్టం

టీపీసీసీ స్టేట్ జనరల్ సెక్రటరీ గడ్డం చంద్రశేఖర్ రెడ్డి




**కామారెడ్డి, మే 04 (జనం పవర్):** కామారెడ్డి జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న ఇందిరా చౌక్ వద్ద ఆదివారం వేకువజామున భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో 22 దుకాణాలు పూర్తిగా కాలిపోవడంతో బాధితులు రోడ్డున పడ్డారు. సమాచారం తెలుసుకున్న టీపీసీసీ స్టేట్ జనరల్ సెక్రటరీ గడ్డం చంద్రశేఖర్ రెడ్డి ప్రమాద స్థలాన్ని సందర్శించి బాధితులను పరామర్శించారు. అఫ్జల్ హోటల్ నిర్వాహకుడు షాహిద్ అభ్యర్థన మేరకు వెంటనే స్పందించి బాధితులకు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ ఘటనపై చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ప్రమాదం చాలా బాధాకరమని దాదాపు కోటి రూపాయల నష్టం జరిగిందని పేర్కొన్నారు. ప్రమాదం షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగిందా లేక మరే ఇతర కారణాలు ఉన్నాయా అనే కోణంలో జిల్లా ఎస్పీ పోలీస్ యంత్రాంగం ఆర్డీఓ రెవిన్యూ అధికారులు విచారణ జరపాలని కోరారు. అధికారులు వెంటనే నష్ట పరిహారాన్ని అంచనా వేసి బాధితులను ఆదుకోవాలని సూచించారు.

### ప్రభుత్వ సహాయం అందాలి

స్థానిక ఎంఎల్ఏ కాటిపల్లి వెంకట రమణ రెడ్డి కూడా వీలైనంత త్వరగా బాధితులను ఆదుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ గడ్డమీది మహేష్ ప్రధాన కార్యదర్శి జూలూరి సుధాకర్ మాజీ కౌన్సిలర్లు చాట్ల వంశీ సలీం జమీల్ రంగ రమేష్ గంగుల్ రెడ్డి రాజశేఖర్ నిరంజన్ కోటి శశి రాహుల్ పాల్గొన్నారు.

# ప్రజల సహకారంతో జనగణనను పూర్తి చేయాలి

నిర్దేశించిన సమయంలోగా సర్వే ప్రక్రియ ముగించాలి

కిషన్ రావు జిల్లా డిప్యూటీ గణాంక అధికారి

**జమ్మికుంట, మే 04 (జనం పవర్):** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సెన్సెస్ (జనగణన) నమోదు కార్యక్రమానికి సంబంధించి ట్రైనర్ల శిక్షణ ముగిసింది. మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి ఆధ్వర్యంలో జిల్లా డిప్యూటీ గణాంక అధికారి కిషన్ రావు సోమవారం శిక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్యూమరేటర్లు ప్రతి ఇంటికి వెళ్లి వివరాలు నమోదు చేయాలని సూచించారు. ప్రజల సహకారంతో ఈ కార్యక్రమం విజయవంతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

### సర్వే గడువు ఖరారు

ఈ నెల 11 నుంచి జూన్ 9 వరకు ఈ సర్వే పూర్తి చేసి నివేదికలు అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా శాస్త్రీయంగా వివరాలు సేకరించాలన్నారు. టౌన్ ప్లానింగ్ అధికారులు శ్రీధర్, టీపీఎస్ రాజ్ కుమార్, టీపీబీఓ దీపికల సహకారంతో ఈ సర్వేను విజయవంతం చేయాలని కోరారు. సర్వే నిర్వహణలో ఎటువంటి సందేహాలు వచ్చినా వెంటనే నివృత్తి చేసుకుని మొత్తం అంశాలను నమోదు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలు కూడా ఎన్యూమరేటర్లకు పూర్తిస్థాయిలో సహకరించి సరైన సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు ట్రైనర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# సిద్దిపేటలో కనులపండువగా హనుమాన్ తెప్పోత్సవం

అంజన్న నామస్మరణతో కోమటి చెరువు పులకింత

విజయవాడ తరహాలో ఆధ్యాత్మిక వేడుకలు

కాళేశ్వర జలాలతో నిండుకుండలా చెరువు

మాజీ మంత్రి హరీష్ రావు



**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

సిద్దిపేట పట్టణం ఆధ్యాత్మిక వనంగా ఎదిగి అంజన్న నామస్మరణ వటవృక్షంలా విస్తరిస్తోందని మాజీ మంత్రి ఎంఎల్ఏ హరీష్ రావు పేర్కొన్నారు. ఆదివారం రాత్రి కోమటి చెరువు వద్ద నిర్వహించిన హనుమాన్ తెప్పోత్సవంలో దుర్గా ప్రసాద్ స్వామితో కలిసి పాల్గొన్నారు. అంజన్న దయ ఉంటే అన్నీ ఉన్నట్టేనని హనుమాన్ మాలధారణ భక్తులలో విశ్వాసాన్ని పెంపొందిస్తోందని ఈ సందర్భంగా తెలిపారు. ఎక్కడ హనుమాన్ నామస్మరణ జరుగుతుందో అక్కడ ఆధ్యాత్మిక భావనతో పాటు మనోధైర్యం అపారమైన భరోసా కలుగుతుందని వివరించారు.

### తెలంగాణలోనే ప్రత్యేకం

సిద్దిపేటలో నిర్వహిస్తున్న హనుమాన్ తెప్పోత్సవం రాష్ట్రానికే తలమానికం అని హరీష్ రావు కొనియాడారు. ప్రతి సంవత్సరం విజయవాడ కృష్ణా నదిలో జరిగే వేడుకలకు ఏమాత్రం తగ్గకుండా కోమటి చెరువులో గోదావరి జలాలతో ఈ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించడం గర్వకారణమన్నారు. మండుటెండల్లో కూడా కోమటి చెరువు నిండుగా ఉండటం కాళేశ్వరం ప్రాజెక్టు ఫలితమేనని స్పష్టం చేశారు. అంజన్న ధైర్యానికి ప్రతీక అని విశ్వాసానికి ప్రతిరూపమని పేర్కొన్నారు.

### పుష్కర ఉత్సవాలకు సన్నద్ధం

ఈ ఏడాది 11వ సంవత్సరం పూర్తి చేసుకున్న ఈ ఉత్సవాన్ని వచ్చే ఏడాది పుష్కర తెప్పోత్సవంగా మరింత వైభవంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. దుర్గా ప్రసాద్ స్వామి ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు డిగ్రీ కళాశాల మైదానంలో లక్ష హనుమాన్ చాలీసా పారాయణం యాగం ఘనంగా జరిగాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామి ఆశీస్సులు పొందారు. సిద్దిపేట ఆధ్యాత్మిక వైభవాన్ని కొనసాగిస్తూ ఈ ప్రత్యేకతను నిలబెట్టాలని కోరారు.

# స్వచ్ఛ మల్కాపూర్ కు శ్రీకారం



**కొండాపూర్, మే 05 (జనం పవర్):** కొండాపూర్ మండలం మల్కాపూర్ గ్రామాన్ని రోగ రహితంగా పరిశుభ్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో గ్రామ పాలకవర్గం స్వచ్ఛ మల్కాపూర్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఆదివారం గ్రామంలోని ప్రధాన రహదారులపై పేరుకుపోయిన చెత్తను గ్రామ ప్రజాప్రతినిధులు స్వయంగా తొలగించి శుభ్రపరిచారు. గ్రామంలో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రజలకు సందేశం ఇచ్చారు. ఈ సందర్భంగా సర్పంచ్ అనిల్ మాట్లాడుతూ ఎవరైనా రోడ్లపై చెత్త వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవసరమైతే జరిమానాలు విధిస్తామని తెలిపారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. పరిశుభ్రమైన వాతావరణంతోనే వ్యాధులను దూరం చేయవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ప్రవీణ్ వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు. ప్రజలందరూ స్వచ్ఛ మల్కాపూర్ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. గ్రామాభివృద్ధిలో పరిశుభ్రత కీలక పాత్ర పోషిస్తుందని వెల్లడించారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని పాలకవర్గం తెలిపింది.

# కోహెడలో కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ



**కోహెడ, మే 04 (జనం పవర్):** సిద్దిపేట జిల్లా కోహెడ మండల కేంద్రంలోని ఎంఆర్ఓ కార్యాలయంలో కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. తీగలకుంటపల్లి గ్రామానికి చెందిన లబ్ధిదారులు ఇట్టిరెడ్డి తారవ్వ, మంద మల్లవ్వ, మెట్టు సరోజనలకు అధికారులు చెక్కులను అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కళ్యాణ లక్ష్మి పథకం ద్వారా పేద కుటుంబాల ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక సహాయం అందుతుందని తహసిల్దార్ నవీన్ తెలిపారు.

### పేదలకు ఆర్థిక భరోసా

ప్రభుత్వం అందిస్తున్న ఈ సహాయం పేద కుటుంబాలకు ఎంతో ఊరటనిస్తుందని సర్పంచ్ మ్యాకల స్వర్ణలత సురేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఆడపిల్లల పెళ్లిళ్లు భారం కాకుండా ఈ పథకం భరోసా కల్పిస్తోందని తెలిపారు. లబ్ధిదారులు ప్రభుత్వం అందిస్తున్న ఈ తోడ్పాటుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రెవెన్యూ అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి అందుతున్న ఫలాలను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. ఈ చెక్కుల పంపిణీతో లబ్ధిదారుల కుటుంబాల్లో హర్షం వ్యక్తమైంది.

జనం పవర్
JANAM POWER
మంగళవారం
05 మే 2026

# బస్వాపూర్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**చిన్ననాటి మధుర స్మృతులను గుర్తు చేసుకున్న మిత్రులు**

**విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు ఘన సన్మానం**

**దివంగత మిత్రులకు నివాళులర్పించిన వైనం**

**2008-09 బ్యాచ్ పూర్వ విద్యార్థులు**



**కోహెడ, మే 04 (జనం పవర్):** సిద్దిపేట జిల్లా కోహెడ మండలం బస్వాపూర్ గ్రామంలో 2008-09 విద్యాసంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం వైభవంగా జరిగింది. ఎన్నో ఏళ్ల తర్వాత పాఠశాల ప్రాంగణంలో కలుసుకున్న మిత్రులు ఆత్మీయంగా పలకరించుకుంటూ చిన్ననాటి మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. ఈ వేడుకలో అప్పటి ఉపాధ్యాయులు పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తమ జీవితానికి పునాది వేసిన గురువులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించి వారి సేవలను కొనియాడారు. ఉపాధ్యాయుల ఆశీస్సులు తమ విజయాలకు మూలమని కృతజ్ఞత తెలిపారు. తమ శిష్యులు వివిధ రంగాల్లో రాణిస్తుండటం చూసి గురువులు ఆనందం వ్యక్తం చేస్తూ మరింత ఎత్తుకు ఎదగాలని ఆశీర్వదించారు. తమతో చదువుకుని మరణించిన మిత్రులను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రెండు నిమిషాల మౌనం పాటించి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. పాఠశాల అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని పూర్వ విద్యార్థులు తీర్మానించారు. సాంస్కృతిక ప్రదర్శనలు, స్మృతి చిహ్నాల అందజేతతో కార్యక్రమం ఉత్సాహంగా ముగిసింది.

# అక్రమ కేసులకు బీఆర్ఎస్ భయపడదు

**కాంగ్రెస్ అరాచక పాలనపై కేటీఆర్ ధ్వజం**

**మన్నె క్రిశాంక్ అరెస్టు రాజకీయ వేధింపులే**

**హామీల అమలు దాకా రాజీలేని పోరాటం**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



**సంగారెడ్డి, మే 04 (జనం పవర్):** రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతోందని కాంగ్రెస్ ప్రభుత్వం కేసులతో వేధింపులకు దిగుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. ఆ వేధింపులకు తాము భయపడబోమని స్పష్టం చేశారు. సోమవారం కంది సెంట్రల్ జైలులో ఉన్న బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్ ను పరామర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. క్రిశాంక్ పై అక్రమ కేసులు నమోదు చేసి జైలులో ఉంచడం అన్యాయమని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన క్రిశాంక్ పై 35కు పైగా కేసులు నమోదు చేయడం దుర్మార్గమని కేటీఆర్ అన్నారు. స్టేషన్ బెయిల్ వచ్చే కేసుల్లోనూ అరెస్టు చేసి జైలుకు పంపుతున్నారని విమర్శించారు. ప్రభుత్వం చేస్తున్న అవినీతి అరాచకాలపై ప్రశ్నించడమే ఆయన చేసిన తప్పా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులపై అవినీతి ఆరోపణలు చేస్తే కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. సోషల్ మీడియాపై చూపుతున్న శ్రద్ధలో కొంతైనా అభివృద్ధిపై చూపిస్తే రాష్ట్రం బాగుపడుతుందని హితవు పలికారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 420 హామీలు 13 డిక్లరేషన్లను అమలు చేసే వరకు తమ పోరాటం ఆగదని కేటీఆర్ స్పష్టం చేశారు. ఎంత వేధింపులు చేసినా ఎన్ని కేసులు పెట్టినా వెనక్కి తగ్గబోమని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పోలీసులు ముఖ్యమంత్రి ప్రైవేట్ ఆర్మీలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. నాయకుల ఫోన్లు ఇళ్ల వద్ద ఉన్న సీసీ కెమెరాలను హ్యాక్ చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ సబితా ఇంద్రారెడ్డి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ వివేకానంద గౌడ్ శంభిపూర్ రాజు పట్నం మాణిక్యం కాసాల బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.



# నేల ఆరోగ్య పరిరక్షణతోనే మేలైన దిగుబడులు

- 99 రోజుల ప్రగతి ప్రణాళికలో రైతు మహోత్సవం
- సేంద్రియ ఎరువులు, నానో యూరియా వాడాలి
- సన్న వడ్ల సాగుకు క్వింటాల్ కు 500 బోనస్
- మున్సిపల్ చైర్ పర్సన్ సీమ రమేష్ షెట్కార్




**బిచ్కుంద, మే 04 (జనం పవర్):** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా బిచ్కుంద రైతు వేదికలో రైతు మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపాలిటీ చైర్ పర్సన్ సీమ రమేష్ షెట్కార్ హాజరయ్యారు. రైతులకు నేల ఆరోగ్య పరిరక్షణ, మట్టి నమూనా తీసే విధానం గురించి వివరించారు. అధిక మోతాదులో యూరియా వాడటం వల్ల ఆరోగ్యానికి, పర్యావరణానికి, నేలకు కలిగే నష్టాలను వివరించి ప్రత్యామ్నాయంగా సేంద్రియ ఎరువులు, నానో యూరియా వాడుకోవాలని సూచించారు.

### సన్న వడ్ల సాగుపై అవగాహన

వానాకాలంలో ప్రభుత్వం నిర్ణయించిన తొమ్మిది రకాల సన్న వడ్లు మాత్రమే పండించాలని రైతులకు సూచించారు. సన్న వడ్లకు ప్రభుత్వం క్వింటాల్ కు 500 రూపాయల బోనస్ ఇస్తుందని తెలిపారు. గ్రామానికి 10 చొప్పున సేకరించిన మట్టి నమూనాల పరీక్ష కార్డులను మున్సిపల్ చైర్ పర్సన్ చేతుల మీదుగా రైతులకు అందజేశారు. మట్టి పరీక్షల ఆధారంగా ఎరువులు వాడి పెట్టుబడి తగ్గించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ కవిత ప్రభాకర్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ భాగ్యలక్ష్మి ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు. కౌన్సిలర్లు ధర్పల్ గంగాధర్, నౌషా నాయక్, ముజాహిద్, మారుతి పటేల్, వాజిద్ నగర్ సర్పంచ్ గోపాల్ రెడ్డి హాజరయ్యారు. అలాగే మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాయిని అశోక్, మండల వ్యవసాయ అధికారి అమర్ ప్రసాద్, వ్యవసాయ విస్తరణ అధికారి శివలింగ్, రైతులు పాల్గొన్నారు.

# రామ్ తండాలో నిలిచిన రోడ్డు పనులు

- అరకోటి నిధులున్నా మారని తండా తలరాత
- స్తంభం పక్కకు జరపడానికి ఏఈ లంచం డిమాండ్
- అంబులెన్స్, బస్సు రాక ప్రజల అష్టకష్టాలు
- సర్పంచ్ సక్రు, ఏఈ లచ్చన్న


3634 ... GOVERNMENT OF TELANGANA
PANCHAYAT RAJ ENGINEERING DEPARTMENT
MGNREGS 2025-26

| Sl. No | NAME OF THE WORK | ESTIMATED COST IN LAKHS |
|---|---|---|
| | LAYING OF CC ROAD FROM ... KAWAL ... | 5.00 |

MANDAL: JANNARAM
GRAM PANCHAYAT: KAWAL
SUB DIVISION: LUXETTIPET
DIVISION: MANCHERIAL
DISTRICT: MANCHERIAL
WORK ID



**తుడుం జితేందర్-జనం పవర్-ఉత్తర తెలంగాణ బ్యూరో**

మంచిర్యాల జిల్లా కవ్వాల్ పంచాయతీ రామ్ తండాలో రోడ్డు పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. ఎమ్మెల్యే బొజ్జు పటేల్ చొరవతో 50 లక్షల నిధులు మంజూరైనప్పటికీ విద్యుత్ స్తంభాల అడ్డంకితో అభివృద్ధి కుంటుపడింది. రోడ్డు మధ్యలో ఉన్న మూడు కరెంటు స్తంభాలను తొలగించాలని కోరగా విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

### ఏఈ లంచం డిమాండ్

స్తంభాలను పక్కకు జరపాలని సర్పంచ్ సక్రు విద్యుత్ ఏఈ లచ్చన్నను ఆశ్రయించగా ఆయన డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. స్తంభాలు తొలగించాలంటే 20 వేల రూపాయలు ఇవ్వాలని ఏఈ మొండికేయడంతో పనులు ఆగిపోయాయి. ఉన్నతాధికారులు స్పందించి లంచం అడుగుతున్న ఏఈపై విచారణ జరపాలని గ్రామస్థులు కోరుతున్నారు. కార్యాలయంలో ఏఈ అందుబాటులో ఉండటం లేదని ఫోన్ చేసినా స్పందించడం లేదని బాధితులు వాపోతున్నారు.

### ప్రజల అవస్థలు

స్తంభాల వల్ల విద్యుత్ తీగలు కిందకు వేలాడుతుండటంతో అంబులెన్స్, స్కూల్ బస్సులు తండాలోకి రావడం లేదు. వర్షం పడితే రోడ్లన్నీ బురదమయంగా మారి విద్యార్థులు వృద్ధులు నరకం చూస్తున్నారు. జిల్లా కలెక్టర్, విద్యుత్ శాఖ ఎస్ఈ స్పందించి వెంటనే స్తంభాలను తొలగించి రోడ్డు పనులు పూర్తి చేయాలని సర్పంచ్ సక్రు డిమాండ్ చేశారు. ఏఈ లచ్చన్నపై కఠిన చర్యలు తీసుకోవాలని తండా ప్రజలు కోరుతున్నారు.

# మట్టి పరీక్షలతోనే సాగు లాభసాటి

- శాస్త్రీయ పద్ధతిలో మట్టి నమూనాల సేకరణ
- రసాయన ఎరువులు తగ్గించి పెట్టుబడి ఆదా
- నేల తల్లి ఆరోగ్యంపై రైతులకు అవగాహన
- ఏఈఓ త్రిసంధ్య, చైర్మన్ లక్ష్మీనారాయణ




**తుడుం జితేందర్-జనం పవర్-ఉత్తర తెలంగాణ బ్యూరో**

మట్టి బాగుంటేనే పంట బాగుంటుందని జన్నారం క్లస్టర్ ఏఈఓ మల్యాల త్రిసంధ్య స్పష్టం చేశారు. సోమవారం పొనకల్ రైతు వేదికలో జరిగిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల అవగాహన సదస్సులో ఆమె రైతులకు దిశానిర్దేశం చేశారు. మట్టిలో ఏముందో తెలుసుకోకుండా ఎరువులు వాడటం వల్ల పెట్టుబడి వృథా కావడమే కాకుండా భూమి నిస్సారమవుతుందని హెచ్చరించారు.



### క్షేత్రస్థాయిలో శిక్షణ

ఏఈఓ నేరుగా పొలాల్లోకి వెళ్లి మట్టి నమూనాను శాస్త్రీయంగా ఎలా సేకరించాలో రైతులకు వివరించారు. రసాయనాలకు స్వస్తి పలికి సేంద్రియ బాట పట్టాలని కోరారు. చీడపీడల నివారణలో మెళకువలు పాటించాలని సూచించారు. సాగులో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారాలను చూపారు.

### శాస్త్రీయ సాగుతో లాభాలు

ముఖ్య అతిథిగా పాల్గొన్న మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అన్నదాతలు అధికారుల సలహాలను పాటిస్తూ సాగును లాభసాటిగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. మట్టి పరీక్షల ఆధారంగా ఎరువులు వాడితే ఖర్చు తగ్గి నాణ్యమైన దిగుబడి వస్తుందని తెలిపారు. విచక్షణారహితంగా ఎరువులు వాడటం మానుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ బీ ఐ కౌన్సిలర్ రవీందర్ రావు, వెటర్నరీ వైద్యాధికారి రాజకుమార్, నేత అజ్మీరా నందు నాయక్ పాల్గొన్నారు. మహిళా రైతులు జక్కుల రజిత, గోగు అంజలితో పాటు పెద్ద సంఖ్యలో రైతులు హాజరయ్యారు. సాయిల్ హెల్త్ వాలంటీర్లు ఈ కార్యక్రమంలో చురుగ్గా వ్యవహరించారు. రైతులను శాస్త్రీయ సాగు వైపు మళ్లించడమే ఈ సదస్సు ఉద్దేశమని అధికారులు వివరించారు.

